# పిప్పి మనిషి

పొద్దున పది గంటలు కావస్తాండె. ఆఫీసులకు పోయే టైము కాబట్టి క్లాక్ టవర్ రోడ్డు చానా రష్షుగా ఉండె. మా తోటలో ద్రాక్షచెట్ల పూతల్ని పురుగులు నాకేస్తాంటే, వాటిని కంట్రోల్ చేసేదానికి సువాక్రాన్ కొనుక్కొస్తామని మందుల షాపుకు పోతాంటి స్కూటర్‌లో.

మా పితృదేవుడు తహసీల్దారుగా పని చేసి రెండు చేతులా సంపాదించి రిటైర్డ్ అయిపోయి కూర్చున్నాడు. అతడు ముప్పయి ఏండ్లపాటు గవర్నమెంటుకు అందించిన సేవలకు ప్రతిఫలంగా ప్రస్తుతం నెలనెలా పెన్షన్ తీసుకుంటాన్నాడు.

మా పెద్దన్న డాక్టరీ చదివి ప్రైవేట్ క్లినిక్ పెట్టుకుని బాగానే సంపాదిస్తాన్నాడు రోగులమీద పడి! రెండో అన్న బిటెక్ చేసి జె.ఇ.గా పని చేస్తా మా తండ్రికి తగ్గ కుమారరత్నం అనిపించుకుంటాన్నాడు. నేను కూడా మా అన్నల మాదిరే లంచాలు వచ్చే ఒక మంచి ఉద్యోగం వెతుక్కోకుండా పనికిమాలిపోయినానని మా తండ్రిగారి విచారం.

నా స్కూటర్ పెద్ద బజారులో మలుపు తిరగ్గానే బ్రేకవేసి రక్కున ఆగిపోతి. అక్కడ రోడ్డువారగా పైమీద నెట్టులేకుండా పడిపోయిండె ఒక మనిషి. ఆ మనిషి పక్కనే రంగు వెలిసిపోయిన ఒక పాత దుప్పటీ, అడుక్కునే సత్తుగిన్నె పడివుండె.

అతని మూతిమీద ఈగలువాలి అతడు కార్చుకునే జొల్లుని పోటీలుపడి నాక్కుంటాంటే నా ఒళ్ళు అసహ్యంతో జలదరించె. అతని మొగం పక్క నిదానించి చూస్తా ఉలిక్కిపడితి. ఆ మనిషి ఇంకెవరో కాదు. నల్లప్ప! మా నల్లప్ప!! నేనింకా చిన్నప్పుడు, మా తోటలో ఏడేండ్లు జీతగానిగా పని చేసిండె.

నా బాల్యం నాటి జ్ఞాపకాల్తో ముడిపడిపోయిన వ్యక్తి నల్లప్ప! మా తోటలో ఇప్పుడున్న ద్రాక్షచెట్లు పెరిగి పెద్దయింది ఈ నల్లప్ప చేతుల్లోనే! ద్రాక్షమొక్కలు ఏపుగా

ఎదిగి తీగలు సాగి నేలమీదకు పాకుతాంటే, దాన్లకు బొంగులు సపోర్టుగా పెట్టె నల్లప్ప. ఆ బొంగుల మీదుగా దాన్లని పందిరి మీదికి తీసుకునిపోయి వదిలి ఇంక అల్లుకుంటా పొండి నా బిడ్డలారా అన్నట్లు వాటిని సంరక్షించె నల్లప్ప.

ద్రాక్షపాదులు తిరగ్గొట్టె.

గంపల్తో ఎరువులు మోసి నీళ్ళు పెట్టె.

గాల్లో ఊగే దీపాన్ని చేతులు అడ్డంపెట్టి కాపాడినట్ల ద్రాక్ష చిగుర్లకు మందుకొట్టి పురుగు అంటకుండా కాపాడె. అవి పూతపట్టి నిండు గర్భిణీ స్త్రీల మాదిరి కళకళలాడతాంటే కళ్ళ నిండుగా చూసుకుంటాండె. రాత్రి మంచు కురుస్తాంటే పందిరికింద పొగపెట్టి ఆ గర్భిణీ చెట్లకు వెచ్చదనం కల్పిస్తా, అవి కడుపు పండి ఇంతింత గొలల్ని విరగ్గాస్తే గర్వంగా చూసుకుంటాండె.

నన్ను భుజం మీద మోస్తాండె.

ఈయన మా చిన్నయ్య! పెరిగి పెద్దయినంక ఈయనే నాకు జీతమిచ్చేది! అని తోటి కూలోళ్ల దగ్గర మురిసిపోతాండె. అప్పటికి ముసిలోన్ని అయిపోయింటాను కదా అయ్యా! ముసిలి నల్లప్పకు పని చేతకాదని నన్ను పనిలోంచీ తీసేస్తావా? అని దిగులుగా మొగంపెట్టి నవ్వుతాండె. అనగనగా ఇద్దరు. ఒకడు ఇసక తప్పిడి, ఇంకొకని పేరు పేడ తప్పిడి అని కథలు చెప్తాండె. కానవా నారదా, కానవా నారదా! అని బయలు నాటకం పదాలు పాడతా నాతోకూడా పాడిస్తాండె.

నా వీపుకి మనగబెండ్లు కట్టి మా బాయిలో ఈత నేర్పిస్తాండె. నాకు ఈత విద్య వచ్చింది ఈ నల్లప్పవల్లే. చెనిక్కాయి పాసేటప్పుడు నన్ను మడక మీద కూర్చోబెట్టుతాండె. టైరు బండి తోలేటప్పుడు నేను బంగపోతే నా చేతికి పగ్గాలు ఇస్తాండె. కొడవలిని పట్టుకుని వంగితే ఇద్దరు కూలోళ్ల మునాల్లోని పైరును ఒక్కడే చకచకా కోసుకుంటా పోతాండె నల్లప్ప!

వడ్లు తూరుపెత్తుతాండె కల్లంలో. గాలి సరిగ్గా తోలకపోతే గంపను అట్లే ఎత్తిపట్టుకుని రా రా రా... పోలిగా! ఎక్కడుండావురో? నీకు మా ఈశ్వరమ్మనిచ్చి పెండ్లి చేస్తాను రారో! అని కూత లేస్తాండె.

ఈశ్వరమ్మ నల్లప్ప చిన్నకూతురు. అతనికి ఇద్దరు కూతర్లు, కొడుకులు లేరు. కొడుకు కలగల్లని ఎందరో దేవుల్లకు మొక్కుకుండిరి నల్లప్పా, నల్లప్ప భార్యా!

కొడుకు కోసం రెండో పెండ్లి చేసుకోవల్ల అని కూడా అనుకుండె నల్లప్ప. అందుకు భార్య గౌరమ్మను ఒప్పించల్ల అని చూసె...

'కష్టం చేస్తేనే కదా మనకు బువ్వ! ఇప్పుడు మన రెక్కల్లో బలముంది కాబట్టి పని చేస్తాం. పొట్ట పోసుకుంటాం. ముసిలోల్లమైనంక అప్పుడు ఒంట్లో సత్తువ ఉండదు

కదా! కూలీనాలీ చెయ్యలేం కదా! అప్పుడు మనకు బువ్వెట్ల? కొడుకు ఉంటే ముసలి ముప్పున మనకింత కూడేసే దిక్కన్నా ఉంటుంది' అని ఎంతో చెప్పిచూసె.

'అప్పటి కత ఇప్పుడెందుకు? దేవుడు పెట్టినట్ల అవుతుంది. నువ్వుగినా నాకు సవితిని తెస్తే ఈ ఇద్దరు పిల్లోల్లనీ పట్టుకుని బాయిలోనో చెరువులోనో దూకి సచ్చిపోతాను' అని భార్య ముక్కు చీది బెదిరించేసరికి నల్లప్ప గప్‌చిప్‌మని అయిపాయ.

నల్లప్ప నడివయసుకు వచ్చినంక భార్య గౌరమ్మ మళ్ళీ గర్భవతి అయి కొడుకును కనె. లేక లేక పుట్టిన కొడుకును చూసుకుని నల్లప్ప ఎంతో సంబరపడిపాయ. ఆ పిల్లోనికి గూగూటి కుళ్ళాయిస్వామి పేరు పెట్టుకుని మొక్కు చెల్లించుకుండె.

'మాకు ముసిలితనంలో ఇంత కూడేసేదానికి దేవుడు నిన్ను పంపించి ఉంటాడురా' అని కొడుకును గుండెలకు హత్తుకుంటాండె.

కొడుకు అంటే తల్లిదండ్రులకు కొరివి పెట్టాల్సినవాడనీ, కొడుకంటే తల్లిదండ్రులను పున్నామ నరకంనుంచీ తప్పించేవాడనీ... ఇట్లాంటి నమ్మకాలు అతనిలో కూడా వుండె. కానీ ఈ నమ్మకాల కంటే ముసలితనంలో ఇంత బువ్వ పెట్టేదానికే కొడుకు! అనే ఆశకి అతడు ఎక్కువగా విలువ ఇచ్చుకుంటాండె.

రెండేండ్లు జరిగె.

ఒక దినం బీరపాదులకు నీళ్ళు పెడతాన్న గౌరమ్మను పాము కరిచె. ఒళ్ళంతా చెమట్లు పట్టె. నిద్దరొస్తాందని తూగె. నోట్లోంచీ నురగలొచ్చె. బండి కట్టుకుని ఆస్పత్రికి ఏనకపోతాంటే దోవ మధ్యలోనే ప్రాణమిడిచె. గౌరమ్మ చనిపోతానే పిల్లోల్ల సంరక్షణ భారమంతా నల్లప్ప మీదపడె.

నేను ఈ పిల్లోల్లని చూసుకోలేనయ్యా. పిల్లోల్లని వాళ్ళ మేనమామ ఇంట్లో ఇడిసిపెట్టి, వాళ్ల దగ్గిరే ఏందన్నా పని చూసుకుని బతుకుతాను అని చెప్పి తన స్వగ్రామానికి ఎల్లిపాయ. అంతే, మళ్ళీ పదహైదేండ్లకు గానీ కన్పించలేదు నల్లప్ప!

★★★

ఆ రోజు నేను ఇంటినుంచీ బైటికి వస్తాంటే... "అమ్మయ్యా! ఇంత అన్నం ఉంటే పెట్టు తల్లీ" అని కాంపౌండు బైట బిచ్చగాని కేక. ఎన్నేండ్లు గడిచినా ఆ స్వరం నాకు గుర్తే! "నల్లప్పా! నువ్వా?" అని అంటి ఆశ్చర్యపోయి.

"ఎవరయ్యా నువ్వు?" అని నేను మాట్లాడిన శబ్దంవైపు తలతిప్పె. కానీ అతని కంటిచూపు నాపై నిలవలే! అప్పటికే పూర్తిగా గుడ్డివాడయిపోయిన నల్లప్ప!

"ఎవర్రా?" అనె బైటికి రాబోతా నా తండ్రి. మన తోటలో జీతం ఉండేవాడు చూడు... ఆ నల్లప్ప! అంటి సంభ్రమంగా.

"అరె! నల్లప్పా?? ఏమిరా ఇట్లా మారిపోయినావు" అనె మా తండ్రి కూడా

ఆశ్చర్యంతో.

"నువ్వా సావుకారీ!" అని గుర్తుపట్టి నల్లప్ప మా తండ్రి గొంతును.

"ఏమిరా? ఇట్లా అయిపోయినావు! నీకేం ఖర్మ వచ్చిందిరా అడుక్కుతినే దానికి" అనె మా తండ్రి సానుభూతిగా.

"ఏం చేయల్ల సావుకారీ! చూపుపోయ. ముసలితనం కూడా వచ్చెకదా!" అనె నల్లప్ప.

నాకు ఈత నేర్పిన నల్లప్ప!

నాకు కథలు నేర్పిన నల్లప్ప!

చెవుకట్లూ ఒదులాయ, చెరకూ తీపాయ... అంటూ ఏవేవో కవిలిపాటలు పాడి వినిపించిన నల్లప్ప! వంకలో తాబేలు పట్టి చేతికిచ్చి... ఆ రకం జీవితో నాకు అంతవరకూ లేని స్పర్శని ప్రథమంగా పరిచయం చేసిన నల్లప్ప!

నాలో నల్లప్ప పట్ల అభిమానం ముంచుకొస్తాండె.

"రా రా! లోపలికి రా! ఇది కొత్త ఇల్లు. ఈ మధ్యనే కొత్తగా కట్టిస్తి" అని గేటు తీసి పిల్చి ఇంటిముందు వరండా మెట్లమీద కూర్చోబెట్టి, నల్లప్పను మా తండ్రి. మా అమ్మను పిల్చి భోజనం పెట్టించె.

నల్లప్ప తన గోడు చెప్పుకొచ్చె...

పెద్దకూతురికి నేనంటే నెర్లే సావుకారీ! నువ్వు నాకాడనే ఉండు నాయినా! ఇంత బువ్వపెట్టి సాకలేకపోతామా నిన్ను? అంటుంది. కానీ దాని మొగుడు ఓర్చలేడు. మీ నాయన మనకు ఏం సంపాదించి పెట్టినాడని బువ్వపెట్టి సాకుతావే దర్చేసిదానా? ఎక్కువ మాట్లాడినావంటే నిన్నుకూడా బైటికి నూకుతాను చూడు అంటాడు. ఇంక రెండో కూతురు ఉంది కదా...! అల్లునికంటే ముందు అయమ్మే నన్ను బైటికి పొమ్మంటుంది. ఆస్తి సంపాదించి ఇచ్చినా ఇయ్యకపోయినా తల్లిదండ్రులకు బువ్వపెట్టి సాకే దరమం కొడుకులకుంటుందిగానీ కూతుర్లకూ, అల్లుళ్ళకూ ఎందుకుంటుంది? అనె. అప్పుడు నల్లప్ప గొంతు తన పరిస్థితికి కూతుర్లనీ అల్లుళ్ళనీ తప్పుపట్టేటట్ల లేకపాయ. ఆడపిల్లలకు ఆస్తిహక్కు లేకుండా చేసినందుకేమో, వాళ్ళకు వాళ్ళ తల్లిదండ్రుల్ని సాకే బాధ్యతనుంచీ కూడా తప్పించింది సమాజం.

"నీకు కొడుకు కూడా ఉండె కదరా?" అని అడిగె మా తండ్రి.

"కొడుకుంటే నాకిట్లా ఈదుల్లోపడి అడక్కతినే ఖర్మేం ఉంటాండె సావుకారీ?" అనె నల్లప్ప.

"మూడేండ్లప్పుడే వాడు కూడా వాళ్ళ అమ్మను చేరుకుండె" అనె నిదానంగా. భవిష్యత్తు దీపం కొడిగట్టినట్ల అతని మొగం నిండా చీకటి పేరుకోనుండె.

"పెద్ద అయ్య ఏం పనిలో ఉన్నాడు సావుకారీ?" అని అడిగె కొంచెంసేపటికి.

"డాక్టరురా!" అనె మా తండ్రి గర్వంగా.

"డాకటరా! సంతోసం సావుకారీ! మిగతా ఇద్దరూ...?" అని అడిగె.

"రెండోవాడు ఇంజనీరురా" అనె అదే గర్వంతో మా తండ్రి.

"మూడో అయప్పా...? చిన్న అయ్యా...??" అని అడిగె నల్లప్ప.

"బి.ఎ. చదివినాడు. ఇంకా ఏ ఉద్యోగమూ లేదు. తోటలు చూసుకుంటాన్నాడు. ఇడుగో! ఇక్కడే ఉన్నాడు. చూడు" అనె. నా గురించి చెప్పేటప్పుడు మా తండ్రి గొంతులో మునపటి గర్వం పలకలే!

"చిన్నయ్యా! ఎక్కడయ్యా నువ్వు? ఇక్కడరా అయ్యా నిన్ను చిన్నప్పుడు బుజాల మీద మోస్తికదయ్యా!" అనె... చేతులు గాల్లో ఆడించి. దగ్గరికి పోయి నిలబడితే నా భుజాలు తడిమి ఆప్యాయంగా చేతులు పట్టుకుండె. "నన్ను మర్చిపోలేదు కదా అయ్యా" అని అడిగె.

మల్లా మా తండ్రి పక్క మొగం జేసి...

"సంతోసం సావుకారీ! సంతోసం!! పిల్లోల్లంతా బాగా సదువుకుని అబివురుద్ధిలోనికి వచ్చినారు. మంచి మంచి ఉజ్జోగాల్లో ఇరుక్కుండారు. ఇంక నీకేం సావుకారీ! సల్లగా ఉండు" అనె సంతోషంతో.

తన సావుకారు ఇంట్లో డాక్టర్లు, ఇంజనీర్లు తయారవుతుంటే తనక్కూడా ఏదో సంతోషం ఒరిగిపోతాన్నట్ల అతని ముఖం వెలిగిపాయ.

జీవితమంతా రెక్కలు ముక్కలు చేసుకున్నా ఒక ఎకరం భూమిని కొనుక్కోలేకపాయ నల్లప్ప.

ఒక చిన్న ఇల్లు కట్టుకోలేకపాయ.

ముసిలితనంలో బతికేదానికి నాలుగు దుడ్లు ఎనకేసుకోలేకపాయ. మాలాంటి నాగలి పట్టని ధనిక రైతులకోసం తన కండలు పిండి శరీరంలోని సత్తువనంతా ఖర్చుపెట్టేసె.

అట్లాంటి నల్లప్పకు

అట్లాంటి గుడ్డి నల్లప్పకు

అట్లాంటి అడుక్కుతినే బికారి నల్లప్పకు... మేం పెద్ద చదువులు చదివినామని చెబితే సంతోషం. మాకు పెద్ద పెద్ద ఉద్యోగాలు వచ్చినాయని చెబితే సంతోషం. మేం కొత్తగా ఇంకో ఇల్లు కట్టుకున్నామంటే సంతోషం. మరో రెండు చోట్ల కొత్తగా తోటలు కొన్నామని తెలిస్తే ఎంతెంతో సంతోషం.

★★★

ఆ రోజు తర్వాత మళ్ళీ ఈ రోజు ఈ విధంగా కన్పించినాడు నల్లప్ప! ఒంటి మీద స్పృహ లేకుండా పడివున్న నల్లప్పను ఇద్దరు మనుషుల సాయంతో రిక్షాలోకి చేరవేస్తి. అతని సత్తుగిన్నెనీ, పాత దుప్పటినీ తీసి రిక్షాలో పెడుతుంటే రోడ్లో వచ్చేపోయే వాళ్ళందరి చూపులూ నాకే గుచ్చుకుంటాన్నట్లు అనిపించె.

నేను వేసుకున్న గుడ్డలూ, నా స్కూటరూ, నా నాగరికత... అన్నీ కలిసి నల్లప్పకూ నాకూ మధ్య ఏవో గోడలు కడతాన్నట్లుండె. ఈ మనిషి నాకేమవుతాడు? అని అడిగె హాస్పిటల్‌లో డాక్టరు కుతూహలంగా. నల్లప్పలాంటి అడుక్కుతినే మనిషి నాకేమవుతాడు? ఒకప్పుడు మా తోటలోని జీతగాడు అని చెప్తే... మీలాంటివాళ్ళు మానవత్వంతో అదుకోలేకపోతే ఇట్లాంటి దిక్కులేనివాళ్ళు ఏమైపోతారో పాపం అని జాలిపడె డాక్టరు. 'ఐ అప్రీషియేట్ యూ మైడియర్ యంగ్ ఛాప్' అని నా భుజం తట్టి మెచ్చుకుండె.

ఆ పొగడ్తకు నా తల నేలకు వాలిపాయ.

నల్లప్ప కష్టం చేసి పండించిన పంటలు తినీ, ఆ పంటలు అమ్ముకొనీ, మరిన్ని ఆస్తులు కొనుక్కునీ, అతడు ముసిలోడై పోయి మా యింటి గడపకే బిచ్చగాడుగా వచ్చి అమ్మా ఇంత అన్నం పెట్టమ్మా అని అడుక్కుంటే ఒక పూట భోజనం పెట్టి పంపించెయ్యడం మానవత్వం!

శరీర కష్టాన్ని కొనడం తప్పించి పనికి నడుం ఒంగని మాలాంటివాళ్ళకోసం అతడు జీవితమంతా ఎద్దు మాదిరి చాకిరీ చెయ్యగా లేనిది రూపాయి దుడ్లు రిక్షాకు ఖర్చుపెట్టి రోడ్లో పై మీద నెట్టులేకుండా పడినవాన్ని ధర్మాసుపత్రిలో చేరిస్తే మానవత్వం!!

ఇప్పుడెక్కడున్నాను? అనె... రెండు సీసాలు సెలైన్ వాటర్ ఎక్కించిన తరువాత స్పృహలోనికి వచ్చిన నల్లప్ప!

"ఆస్పత్రిలో ఉన్నావు నల్లప్పా! ఇప్పుడెట్లుంది పైలో?' అని అడిగితి.

'ఎవరు? మా చిన్నయ్యా నువ్వు? నన్ను ఆస్పత్రిలో చేర్పించినావా? మా అప్పా! మా తండ్రీ!! నా ఆయుస్సు కూడా పోసుకుని నూరేండ్లు సల్లగా బతుకుసామీ!' అనె కింద మెత్తగా తగులుతాన్న ఆస్పత్రి పరుపు తడుముకుంటా.

అతని మొగంలో కృతజ్ఞత!

యజమాని మీద భక్తి!

'ఒరే నల్లప్పా! నా చెప్పులు ఆ బాయిగడ్డనే మరిచి పోయినానేమో చూడరా!' అని మా తండ్రి కూతేస్తే పరుగెత్తిపోయి, చెప్పులు చేత్తో పట్టుకొచ్చి వినయంగా ఒంగుతూ కాళ్ళ దగ్గర పెట్టేటప్పుడు అతని కళ్ళల్లో ఇదే భక్తి తొణికిసలాడతాండె.

★★★

అయిదారు దినాలు ఆస్పత్రిలో ఉండె నల్లప్ప.

వాళ్ళు పాలు పోస్తాండిరి.

తాగుతాండె.

అన్నం పెడతాండిరి.

తింటాండె.

బ్రెడ్డూ, పండ్లూ కూడా ఇస్తాండిరి.

ఆ కొన్ని రోజులూ... నల్లప్పతో ముడిపడిన నా చిన్ననాటి రోజుల్ని తలచుకొని ఆ జ్ఞాపకాలన్నీ ఏకరువు పెట్టడం అలవాటు అయిపాయ. 'ఆ చిన్నప్పటి సంగతులన్నీ ఇంకా ఎంత బాగా గుర్తుపెట్టుకున్నావు సామీ' అని నల్లప్ప పొంగిపోతాండె. నల్లప్ప కూడ మా తోట గురించిన జ్ఞాపకాల్ని తవ్వుకోవడం మొదలుపెట్టె.

'మన తోటలో నల్లకుక్క ఉండెకదా! అబ్బ! ఎంత తెలివి దానికి! నిన్ను మీ నాయన కొడతాంటే నీతోపాటు అది కూడా కుయ్యోమని అరుస్తా మీ నాయనమీదికి రెండు కాళ్ళతో ఎగబాకి అడ్డుకుంటాండె గదా, పాపం!' అని అంటాండె.

'మన బోడి ఎనుము ఉండెగదా! దాని మాదిరి పాలు పిండే ఎనుముని నేను ఎక్కడా చూడలేదు అయ్యా! ఎవరికో అమ్మేస్తే, అది సచ్చేముందు మళ్లా మన తోట్లోకే వచ్చి ప్రాణాలు ఇడిసిపెట్టెకదా, పాపం!' అంటాండె.

తోటలో పని చేసేటప్పుడు అతడు తోలిన బండీ, చేత్తో పట్టిన పారా, మందులు కొట్టే మిషినూ...అన్నీ అతని స్పర్శకు ఇంకా అందుతాన్నట్టే ఉండె.

'మీ నాయన దరమ పెబువు' అని మా తండ్రిని పొగడుతాండె.

'నేను మీ తోట ఇడిసిపెట్టి పొయ్యేటప్పుడు నాకువచ్చే జీతంగాక యాభై రూపాయలు పైగా నా చేతిలో పెట్టిండె' అని మాటిమాటికీ గుర్తు చేసుకుంటాండె.

'మన ద్రాక్ష చెట్లు బాగుండాయా?' అని కుశలమడుగుతాండె.

'అవి కూడా నా మాదిరే ముసిలివైపోయి ఉంటాయి కదా!' అని నవ్వుతాండె.

★★★

ఒక దినం నర్సు వచ్చి... 'ఈయన్ని డిశ్చార్జి చేసినాము, ఇంక తీసుకుపోవచ్చు' అని చెప్పె.

నేను నర్సు చేతిలో పదిరూపాయలు పెడ్తే, ఆయమ్మ సంతోషపడిపోయి 'ఈ పేషెంటు ఉప్పూ కారమూ ఎక్కువగా తినకూడదండీ, గుడ్లూ చపాతీలూ లాంటి బలమైన తిండి తినల్ల' అని చెప్పి ఎల్లిపాయ.

'నా దుప్పటీ, సత్తు గిన్నే ఏవీ?' అని నల్లప్ప బుటుక్కుండె. నేను సంతకం చేసి తిరిగి వచ్చేటప్పటికి నల్లప్ప సిద్ధంగా నిలబడుండె.

చేయిపట్టి పిల్సకపోయి రోడ్డుమీద వదిలిపెట్టి నల్లప్పను.

'ఇంక పోతానులే అయ్యా! పరవాలేదు. చెట్లను సరిగా చూసుకోండయ్యా, అని వప్పగింతలు పెట్టె.

అన్నత్రిలో తినకుండా దాచిపెట్టుకున్న బ్రెడ్డునీ, పండ్లనీ చేతుల్లో భద్రంగా పట్టుకోనుండె.

'తినకుండా దాచిపెట్టుకుండావా?' అని అడిగితే, 'మాఊరికి పోవల్ల సామీ! ఊర్లో ఉన్న నా కూతురు కొడుకులు గుర్తుకొస్తాండారు. ఆ పిల్లోల్లకు ఏమన్నా తీసకపోవల్లకదా!' అని నవ్వె.

పరసన్నాయిపల్లి వెంకటరామిరెడ్డి తోటలో నాలుగేండ్లు పనిచేసె.

మాబుఖాన్ తోటలో రెండేండ్లు, నట్టుశెట్టి తోటలో అయిదేండ్లు పనిచేసె. ఇంకా ఎన్నెన్ని చోట్లనో ఎన్నెన్నో ఏండ్లు పనిచేసె. తన ముప్పయి ఏండ్ల కాయకష్టాన్ని ఈ సమాజానికి సమర్పించుకుండె. అయినా నల్లప్పకు మనుషుల మీదగానీ, వ్యవస్థమీదగానీ కోపం లేదు. తనకు ముసిలితనంలో కూడేసేదానికి ఒక కొడుకు కూడా లేకపాయ కదా అన్న దిగులు తప్పించి.

నల్లప్ప చేతిలో ఇరవై రూపాయల కాగితాన్ని పెట్టి 'వస్తాను నల్లప్పా' అని వెళ్లబోతుంటే, ఆ నోటును భక్తిగా కళ్ళకు అద్దుకుంటా 'మా అప్పా! మా తండ్రీ! సల్లగా ఉండు సామీ! అని బైటికి వినిపించేటట్ల గొణుక్కుండె.

నాలుగడుగులేసి వెనక్కి తిరిగిచూస్తే... గుడ్డికళ్ళకింద నవ్వుతూ ఇంకా అక్షే నిలబడిఉండె; చేతులు జోడించి కృతజ్ఞతా భారంనుంచీ తేరుకోలేక.

రోడ్డుపక్కన చెరకు రసం తీసే యంత్రం!

చక్రం తిప్పితే చెరకుగడను లోనికి లాక్కొని అదిమిపడతాండె. ఆ చెరకును నలిపి నలిపి పిండి పిండి ఆ సారాన్నీ, రసాన్నీ గిన్నెలోకి ఒలికించి పిప్పిని మాత్రం బైట రోడ్డుమీద పడేస్తాండె.

రోడ్లో చెల్లాచెదురుగా పడి వున్న ఆ చెరకు పిప్పిని నా కాళ్ళక్కూడా అంటకుండా తప్పుకుని గబగబా అడుగులేస్తూ వెళ్ళిపోయినాను.